## క్లుప్తంగా

### వసతిగృహాల్లో ఆకస్మిక తనిఖీలు



హాస్టల్ పరిసరాలు పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

**విజయనగరం లీగల్:** నగరంలోని సుంకరవీధి ఎస్సీ, మహారాణిపేట బీసీ, ఎస్టీ వసతిగృహాలు సహా బాలసదన్ చిల్డ్రన్‌హోమ్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ గురువారం సందర్శించారు. ఆయా హాస్టళ్లలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి వసతిగృహాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడడంతో పాటు విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు మెరుగుపరచాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

### వాహన తనిఖీలు



కారు డిక్కీలో సోదాలు చేస్తున్న పోలీసులు

**డెంకాడ:** మండలంలోని అయినాడ జంక్షన్ వద్ద పోలీసులు గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడు సిబ్బందితో కలిసి అటువైపుగా వచ్చే వాహనాల్లో సోదాలు చేశారు. గంజాయి, మద్యం, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలు రవాణా జరగకుండా, చలాన్లు పెండింగ్ లేకుండా, రోడ్డు భద్రతా నియమాలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌ఐ తెలిపారు.

### పాలనలో కూటమి ప్రభుత్వం విఫలం



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న జైభీమ్‌రావ్ భారత్ పార్టీ నాయకులు

**నెల్లిమర్ల:** రాష్ట్ర పరిపాలనలో కూటమి ప్రభుత్వం విఫలమైందని జైభీమ్‌రావ్ భారత్ పార్టీ నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.నరసయ్య, కె.శ్రీనివాసరావులు విమర్శించారు. కూటమి హయాంలో దళితులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ పట్టణంలోని రామతీర్థం జంక్షన్‌లో ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి గురువారం వినతిపత్రం సమర్పించారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇప్పటివరకు ఏ ఒక్క హామీ అమలు చేయలేదని చంద్రబాబు సర్కారును దుయ్యబట్టారు. అంతేకాకుండా రాష్ట్రంలోని బడుగులకు రక్షణ కరువైందన్నారు. ఇప్పటికైనా ప్రజలు మెచ్చే పరిపాలన చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఆ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిన్నం అరుణ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి మరడాన వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం



యోగా సాధన చేస్తున్న ప్రజలు

**విజయనగరం:** యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక రింగ్ రోడ్డు వేంకటేశ్వరస్వామి ఆర్చ్ వద్ద యోగా సాధన కార్యక్రమం గురువారం చేపట్టారు. ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇందుమతి.. యోగాసనాలు వేయించి, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అనంతరం యోగాపై అవగాహన ర్యాలీ చేపట్టారు.

**డెంకాడ:** మండల కేంద్రంలో గురువారం జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి పాల్గొని, యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు యోగా సాధన చేయాలని, యోగా అనేది జీవనశైలిలో భాగస్వామ్యం కావాలన్నారు.

### ప్రపంచ శాంతికి ప్రార్థనలు చేయండి

**విజయనగరం టౌన్:** ఈదుల్ జుహా బక్రీద్ పర్వదినం పురస్కరించుకుని, ముస్లిం సోదరులంతా ప్రపంచ శాంతికి ప్రార్థనలు చేయాలని మాజీ వక్ఫ్‌బోర్డ్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ కరీమ్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. అన్ని ఈద్‌గాలలో నమాజ్ చేసి, హజరత్ ఇబ్రహీం త్యాగానికి, శాంతికి, సమైక్యతకు పూజలు చేయాలన్నారు. దేశాభివృద్ధికి కులమతాలకతీతంగా అందరూ అడుగులు వేయాలన్నారు.







# అధ్వాన దారులు.. ఎన్నాళ్లీ అవస్థలు!

విజయనగరం జిల్లా కేంద్రంలోని రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయి. ఏ దారి చూసినా అడుగుకో గుంత..గజానికో గొయ్యి మాదిరి కనిపిస్తోంది. కొన్నిచోట్ల రోడ్లు పూర్తిగా ధ్వంసం కావడంతో ఆ వైపుగా ప్రయాణించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. మరికొన్ని చోట్ల రోడ్ల మధ్యలోని గోతులు వర్షపునీటితో నిండిపోవడంతో ఏది సమతలమో.. ఏది గుంతో తెలియని పరిస్థితి. దీంతో పలువురి వాహనాలు ఆ గుంతల్లో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక పాదచారుల పరిస్థితి అయితే చెప్పాల్సినవసరం లేదు. కాళ్లు పుండ్లు అయిపోతున్నాయని, ఒళ్లు హూనమైపోతోందని వాపోతున్నారు. ఎన్నాళ్లీ అవస్థలు అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. అధికారంలోకి రాగానే గుంతలు లేని రోడ్లు.. అద్దంలా మెరిసే దారులు వేసి చూపిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి నాయకులను నిలదీస్తున్నారు. ఇప్పటికైనా రోడ్లు బాగు చేయడంపై దృష్టిసారించాలని కోరుతున్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



కలెక్టరు కార్యాలయం రోడ్డులో వర్షపునీటితో గొయ్యి



ప్రశాంతినగర్ రోడ్డులో కోతకు గురైన రోడ్డు



కొత్తపేట వెళ్లే రోడ్డులో మరమ్మతులకు గురైన రోడ్డు



రింగ్‌రోడ్డులో ఓ చోట ఇలా..

## ● ఎస్జీటీలకు పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు కేటాయించాలి



సీనియర్ ఎస్జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్)లకు పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు కేటాయించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన జిల్లా కేంద్రానికి గురువారం వెళ్లి, డీఈవో యు.మాణిక్యంనాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. చాలామంది ఎస్జీటీలు 30 నుంచి 35 సంవత్సరాల సీనియార్టీ ఉండి కూడా ఉద్యోగోన్నతి లేకుండా ఎస్జీటీలుగానే పదవీ విరమణ పొందుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నా 1400 పీఎస్‌హెచ్‌ఎం పోస్టులను ఎస్జీటీలకు కేటాయించి, వారిని గౌరవించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. –విజయనగరం అర్బన్

## ● నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు



నాసిరకం విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో పూర్ణిమ హెచ్చరించారు. నెల్లిమర్ల మండల కేంద్రంలోని మన గ్రోమోర్, శ్రీనివాస ట్రేడర్స్ ఎరువుల షాపుల్లో ఆమె గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నిల్వలను రికార్డుల ఆధారంగా సరిచూసి, పలు సూచనలు చేశారు. నిబంధనలు ప్రకారం విక్రయాలు చేయాలని, కొనుగోలు చేసిన ప్రతిరైతుకూ రసీదు అందివ్వాలని తెలిపారు. –నెల్లిమర్ల

## ● కలెక్టరేట్‌లో అంధకారం



విజయనగరం జిల్లా కలెక్టరేట్‌లో అంధకారం నెలకొంది. బుధవారం అర్ధరాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో పలుచోట్ల చెట్లకొమ్మలు విద్యుత్‌తీగలపై పడ్డాయి. దీంతో కలెక్టరు కార్యాలయానికి కరెంట్ సరఫరాకు నిలిచిపోయింది. ఈ విషయంపై కలెక్టరేట్ ఏవో దేవ్‌ప్రసాద్ విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా, చెట్లకొమ్మల తొలగింపు పనులు చేపట్టారు. గురువారం సాయంత్రం వరకు కరెంట్ సరఫరా కాకపోవడంతో పలు విభాగాల సేవలకు ఆటంకం ఏర్పడిందని సిబ్బంది తెలిపారు. –విజయనగరం అర్బన్

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేకాలంకరణలో వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారు

**విజయనగరం టౌన్:** స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో వేకువజాము నుంచి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నారాయణం శ్రీనివాస్ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు.

**ధర్మపురి రోడ్డులో..**

స్థానిక ధర్మపురి రోడ్డులోని దత్త సాయి సమర్థ పీఠంలోని సాయి బాబా ఆలయ శిఖర పునఃప్రతిష్ఠ మహోత్సవం గురువారం జరిగింది.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని, హరితాంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా మొక్కలు నాటే కార్యక్రమానికి ప్రభుత్వం గురువారం శ్రీకారం చుట్టింది. వాడవాడలా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని, మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటాలని తెలిపారు. ఖాళీ ప్రదేశాలు, ఇంటి ముంగిట, పెరటిలో మొక్కలు పెంచి, పచ్చదనానికి పాటుపడాలని కోరారు.

–విజయనగరం, నెల్లిమర్ల నెట్‌వర్క్



విజయనగరం అర్బన్: కస్పా ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డీఈవో మాణిక్యంనాయుడు తదితరులు



నెల్లిమర్లలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే నాగమాధవి తదితరులు



విజయనగరం: పూల్‌బాగ్ పార్కు వద్ద మొక్కలు నాటుతున్న కమిషనర్ నల్లనయ్య తదితరులు



విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ జీవీలోని ఇంజినీరింగ్ కాలేజీలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు తదితరులు





విజయనగరం అర్బన్: సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మొక్కలు నాటుతున్న సిబ్బంది, విద్యార్థులు



డెంకాడ: ఎంపీడీవో కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే నాగమాధవి



పూసపాటిరేగలోని నల్లచెరువు గట్టుపై మొక్కలు నాటుతున్న తహసీల్దారు గోవింద



విజయనగరం ఫోర్ట్: జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న డీఎంహెచ్‌వో జీవనరాణి



భోగాపురం శ్మశానవాటికలో మొక్కలు నాటుతున్న మండల అధికారులు

## ప్రభుత్వ కార్యక్రమమా.. రాజకీయ సమావేశమా?

● కొండవెలగాడలో జనసేన పార్టీ నాయకుల అతి..



కొండవెలగాడలో మొక్కలు నాటే కార్యక్రమంలో పార్టీ కండువాలతో జనసేన నాయకులు



వెలగాడ నగరవనంలో పార్టీ కండువాలతో హాజరైన జనసేన పార్టీ నాయకులు

**నెల్లిమర్ల రూరల్:** నవ్విపోదురు గాక..నాకేటి సిగ్గు అన్న చందంగా ఉంది.. నియోజకవర్గంలోని కొంత మంది జనసేన పార్టీ గ్రామస్థాయి నేతల తీరు. ఇప్పటికే ఆ పార్టీ ఎమ్మెల్యే లోకం నాగమాధవి హాజరయ్యే కార్యక్రమాలకు టీడీపీ నేతలు రాకుండా బాయ్‌కాట్ చేస్తున్న సంగతి తెలిసిందే. దీంతో జనసేనలోని చోటామోటా నాయకులు చేసే హడావిడి అంతా ఇంతా కాదు. ప్రభుత్వ కార్యక్రమాలకు సైతం రాజకీయ సమావేశంలా పార్టీ కండువాలతో హాజరవుతూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమం అనుకున్నారా.. లేక రాజకీయ సమావేశం అనుకున్నారా అని ఏ కార్యక్రమానికి కండువాలతో హాజరుకావాలోనన్న విషయం కూడా తెలీదా అని జనం నవ్వుకుంటున్నారు. గురువారం మండలంలోని కొండవెలగాడ, వెలగాడ నగరవనం ప్రాంతాల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హరితాంధ్రప్రదేశ్ సాధన లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమానికి ఇలా కండువాలతో జనసేన నాయకులు హాజరయ్యారు. సాక్షాత్తు ఎమ్మెల్యే, కలెక్టరు హాజరైన ఈ కార్యక్రమానికి వారు అలా హాజరవుతుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ కార్యక్రమంలో పార్టీ కార్యక్రమంలా హడావిడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశిస్తున్నారు. పైగా ఏ హోదా లేని నాయకులను ప్రభుత్వ కార్యక్రమాలకు ఏ విధంగా ఆహ్వానిస్తున్నారని నిలదీస్తున్నారు. ఇంత జరుగుతున్నా వారిలో ఏ మాత్రం మార్పు రాకపోవడంతో జనం ముక్కున వేలేసుకుంటున్నారు.

## ఆక్రమణలు తొలగించకుంటే ధర్నా చేస్తాం..

● మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ వీరవెంకట రాజేష్



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

**విజయనగరం:** మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆక్రమణలు తొలగించకపోతే తామే ధర్నా చేస్తామని కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శట్టి వీరవెంకట రాజేష్ హెచ్చరించారు. నగరంలోని గంటస్తంభం, దాసన్నపేట రైతుబజారు ఎదురుగా పుట్‌పాత్‌లను ఆక్రమించుకుంటుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నగరంలో మేయరు వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆయన..కోట్లాది రూపాయలతో నగర సుందరీకరణ చేస్తే అది కనిపించకుండా ఆక్రమణదారులు వ్యవహరిస్తున్నారని, వారి ఆక్రమణల కారణంగా వెలిసిన బడ్డీలు, దుకాణాలతో నగర సుందరీకరణ కనిపించడం లేదన్నారు. అలాగే విద్యుత్ లైట్లు చాలా ప్రాంతాల్లో వెలగడం లేదని, నగరంలో పారిశుధ్య పనుల నిర్వహణకు సిబ్బంది చాలడం లేదన్నారు. నగరానికి 800 మంది పారిశుధ్య కార్మికులు అవసరం కాగా 600 మంది మాత్రమే ఉన్నారన్నారు. బినామీ కార్మికులు ఎంతమంది ఉన్నారనేది బయటకు తీసి, మరో 200 మంది కార్మికులను నియమించేలా చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులు కోరారు. కార్పొరేషన్ భూములు సంరక్షించాలని, నగరాభివృద్ధి పనులను పరిశీలించి సంతృప్తి చెందితేనే బిల్లులు చెల్లించాలని అధికారులకు కమిటీ సూచించింది. అనంతరం నగరంలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు సంబంధించిన అజెండాలోని 31 అంశాలకు గాను 30 అంశాలకు కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. కమిటీ ఆమోదించిన పనులను నెలాఖరులోగా ప్రారంభించాలని మేయర్ విజయలక్ష్మి, ఫ్లోర్ లీడర్ రాజేష్‌లు అధికారులను ఆదేశించారు.

**ఫ్లెక్సీల్లో ఫొటోలేవీ?**

నగరంలో నెల రోజుల పాటు జరిగే యోగాంధ్ర కార్యక్రమ ఫ్లెక్సీలు, బ్యానర్లలో మేయర్, ఎమ్మెల్యేల ఫొటోలు పెట్టకపోవడం ఎంతవరకు సబబు అని కమిటీ సభ్యులు అధికారులను ప్రశ్నించారు. ఈ విషయంలో అధికారులు ప్రోటోకాల్ ప్రకారం నడుచుకోకపోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ జనరల్ ఫండ్ ఖర్చు చేస్తున్నా ప్రజాప్రతినిధుల ఫొటోలు వేయకపోవడమేంటని ప్రశ్నించారు. మరోసారి ఇది పునరావృతమైతే ఊరుకునేది లేదని అధికారులను హెచ్చరించారు. అనంతరం టేబుల్ అజెండాలోని మూడు అంశాలను కమిటీ ఆమోదించింది. సమావేశంలో సభ్యులు రేగాన రూపవతి, అల్లు చాణక్య, సుంకరి నారాయణరావు ,కమిషనర్ నల్లనయ్య, అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.